లోపాలు ఎవరికెరుక!

అంగన్‌వాడీ కేంద్రాలకు అందని పౌష్టికాహారం

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ నెలలో ఒక్క పాల ప్యాకెట్ కూడా సరఫరా కాలేదు. దీన్నిబట్టి పాలు సరఫరా అవుతాయా.. లేదా అన్న దానిపై అనుమాన నీడ కమ్ముకుంది. గత నెల్లోనే ఈ తరహా సమస్య తలెత్తినా పరిష్కరించే దిశగా అధికార యంత్రాంగం చొరవ తీసుకోకపోవడం విచారకరం. కర్ణాటక ప్రభుత్వ రంగ సంస్థ నుంచి మన రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా పాలను కొంటోంది. రవాణాను మాత్రమే గుత్తేదారులకు అప్పగించింది. అదిగో.. ఇదిగో అంటుండటంతో అంగన్‌వాడీ కార్యకర్తలు నిరీక్షిస్తున్నారు. ఇదే క్రమంలో లబ్ధిదారుల నుంచి తీవ్ర ఒత్తిడి పెరిగింది.

ఎన్నికల్లో బిజీబిజీ

అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం సకాలంలో సరఫరా అయిందా లేదా అన్న దానిపై రాష్ట్రం నుంచి క్షేత్ర అధికారుల దాకా ఎవరూ పట్టించుకోవడం లేదు. పీడీ, సీడీపీవో, సూపర్‌వైజర్లు.. ఇలా అధికారులను స్థానిక సంస్థల ఎన్నికల విధులకు నియమించారు. అందరూ అటువైపే దృష్టి సారించి పని చేస్తున్నారు. కేంద్రాలు, లబ్ధిదారులను పూర్తిగా విస్మరించారు. ఒక్క పాలే కాదు.. చిన్నారులకు ఇచ్చే బాలామృతం ప్యాకెట్లు కూడా సరిగా ఇవ్వలేదు.

4.47 లక్షల లీటర్లు..

జిల్లాలో 2,302 అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింత/గర్భిణులు 24,440 మంది, ఆరు మాసాల నుంచి ఆరేళ్ల వరకు పిల్లలు 1,12,952 మంది ఉన్నారు. గర్భిణి, బాలింతలకు నెలకు ఒక్కొక్కరికి 5 లీటర్లు, పిల్లలకు 2.5 లీటర్ల చొప్పున పంపిణీ చేయాల్సి ఉంది. ఈ లెక్కన సరాసరి ప్రతి నెలా 4.47 లక్షల లీటర్ల పాలు అవసరం. గత నెల్లో కొంత మిగిలిన పాల ప్యాకెట్లను కొన్ని కేంద్రాల్లో పంపిణీ చేశారు. 90 శాతంపైగా లబ్ధిదారులకు పాల ప్యాకెట్లను ఇవ్వలేదు. ఇక.. బాలామృతం మూడేళ్లలోపు పిల్లలకు ఒక్కొక్కరికి 2.5 కిలోల ప్యాకెట్ ఇవ్వాల్సి ఉంది. ఈ విషయమై ఐసీడీఎస్ పీడీ సాజిదాబేగం వివరణ కోరగా.. పాల ప్యాకెట్ల సరఫరా ఆలస్యమైన మాట నిజమే. రెండ్రోజుల్లో సరఫరా అయ్యేలా చూస్తాం. రాష్ట్ర అధికారులతోనూ మాట్లాడాం. డెయిరీ నుంచే రావాల్సి ఉందన్నారు.

పీఎండీఎస్ విధానం.. దానిమ్మకు లాభం

మడకశిర మండలంలోని కొత్తలం గ్రామానికి చెందిన రైతు రవిప్రతాప్‌రెడ్డి 2021 నుంచి దానిమ్మ సాగులో అధిక దిగుబడులు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే మడకశిర ప్రాంతంలో బోరులో ఉన్న కొద్దిపాటి నీటితో పీఎండీఎస్ (ప్రీమాన్‌సూన్ డ్రైసోయింగ్) విధానాన్ని అనుసరించి పంటను కాపాడుకుంటున్నారు. సాధారణ సాగు పద్ధతులకన్నా నాణ్యమైన, ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించి మార్కెట్‌లో అధిక ధరకు విక్రయిస్తున్నారు. **- న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం**

అంతర పంటలతో పోషకాలు

దానిమ్మతోటలో అంతర పంటగా కంది, ఆముదం, అలసంద, సజ్జ, అనుములు వంటి ప్రధాన పంటలతో పాటు 20 రకాల జీవవైవిధ్య పంటలు సాగు చేశారు. ఇలా సాగు చేయడంతో దానిమ్మకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా అంది దిగుబడికి అనుకూలంగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెప్పడంతో రైతు ఈ విధానాన్ని పాటించారు. దీనికితోడు రసాయనాలు వాడటం లేదు. ఘన జీవామృతాన్ని తయారు చేసి 6 ఎకరాలకు 2,400 కిలోలు వేశారు. కొంటిపాలు ఉడకబెట్టి దానిమ్మతోటలకు కషాయాన్ని పిచికారీ చేశారు. ఇలా చేయడం వలన తోటకు వైరస్ ఆశించలేదు

బిగ్‌బాస్కెట్ కొనుగోలు

పూర్తిస్థాయిలో సేంద్రియ పద్ధతులతో పండించిన దానిమ్మకాయలను దిల్లీ బిగ్‌బాస్కెట్ మార్కెటింగ్ వారు శాంపిళ్లను తీసుకువెళ్లి ల్యాబ్‌లో నాణ్యతను పరీక్షించి అనంతరం కిలో రూ.110 చొప్పున కొనుగోలు చేశారు. దాదాపు రూ.33 లక్షలు వచ్చిందని, సాగు ఖర్చు రూ.5 లక్షలు పోను రూ.28 లక్షల దాకా ఆదాయం చేతికందిందని రైతు సంతోషం వ్యక్తం చేశారు.

రవిప్రతాప్‌రెడ్డి రైతు

సమస్య.. సమాధానం

బుక్కరాయసముద్రం: జిల్లాలో వివిధ రకాల పంటలు సాగుచేసిన రైతులు సాగులో ఎలాంటి సందేహాలున్నా రెడ్డిపల్లి కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త **కిశోర్‌రెడ్డి** నంబరు: 94933 44440కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు పొందవచ్చు.

సమస్య: వరి పంట ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. పంటకు ఆకుగూడు పురుగుల ఉధృతి అధికంగా ఉంది. ఈ పురుగులను ఎలా నివారించాలి? **-మోహనకృష్ణ(జంతులూరు)**

సమాధానం: వరిలో ఆకుగూడు పురుగుల ఉధృతి అరికట్టడానికి క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే పురుగులు నశిస్తాయి.

సమస్య: రెండు ఎకరాల్లో ఉల్లిపంట సాగుచేశాం. పంటను తామర పురుగులు ఆశించాయి. తెగులు నివారణకు మార్గం తెలపండి. **-సిద్ధయ్య(పెద్దవడుగూరు)**

సమాధానం: తామర పురుగుల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే సరిపోతుంది.

ఫీట్లు కాదు పాట్లు

అధిక లోడ్ వేయడంతో ఇలా..

ఇది ఆటో ఫీట్లు అనుకుంటే పొరపాటే.. సామర్థ్యానికి మించి అధిక బరువు వేయడంతో ఇలా జరిగింది. కళ్యాణదుర్గం పట్టణంలోని స్థానిక యూనియన్ బ్యాంకు ఎదురుగా ఓ ఆటోలో ఎక్కువగా లోడ్ వేయగా ఒరిగి ముందు భాగం పైకి లేచి అలాగే నిలబడింది. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే కిందకు దిగాడు. కొంతసేపు ఆ ప్రాంతంలో ప్రతి ఒక్కరినీ భయకంపితులను చేసింది. **- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం**

కూటమి గెలుపుతోనే వికసిత అనంతపురం: లంకా దినకర్

మాట్లాడుతున్న లంకా దినకర్

ఈనాడు, అనంతపురం: వికసిత అనంతపురంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రధాన లక్ష్యమని భాజపా నేత, 20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. ఎన్నికల్లో కూటమి మేయర్ అభ్యర్థి ఆదెప్పబాబుతో పాటు 62 డివిజన్ల అభ్యర్థులను గెలిపించాలని నగర ప్రజలను అభ్యర్థించారు. సోమవారం కూటమి కార్యాలయంలో వైకాపా అస్తవ్యస్త విధానాలతో జరిగిన నష్టాన్ని, కూటమి ప్రభుత్వంలో సాధించిన నిధులను వివరించారు.

వైకాపా వైఫల్యాలు: 2017లో తాగునీటి సరఫరా అభివృద్ధి పనులకు రూ.145 కోట్లు కేటాయిస్తే 2024 నాటికి రూ.67 కోట్లే ఖర్చు చేశారు. అందులోనూ 50శాతం పనులు పూర్తి కాలేదు. 10 ఎంఎల్‌డీ సామర్థ్యమున్న రూ.29.76 కోట్ల పనులు ప్రారంభించకుండానే రద్దు చేశారు. స్మార్ట్ వాటర్ డ్రైనేజీ కింద రూ.21 కోట్ల పనుల్లో 15శాతం మాత్రమే పూర్తిచేశారు. పీఎంఏవై (అర్బన్) కింద జిల్లాకు కేటాయించిన 76,597 గృహాల్లో 33,007 మాత్రమే పూర్తయ్యాయి. 2019కు ముందు మంజూరైన 12,096 టిడ్కో ఇళ్లలో 2024 నాటికి 320 ఇళ్లే నిర్మించారు. వైకాపా ఐదేళ్లలో అనంత కార్పొరేషన్‌కు రూ.179 కోట్లు కేటాయించి, అందులో సింహభాగం పక్కకు మళ్లించింది.

కూటమి కేటాయింపులివీ..: 2024లో కూటమి ప్రభుత్వం వచ్చాక అనంతపురంలో అమృత్ 2.0 పథకం కింద రూ.120 కోట్లు విడుదలై పనులు జరుగుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు రూ.70 కోట్లు మంజూరయ్యాయి. కార్పొరేషన్ అభివృద్ధికి అదనంగా రూ.857 కోట్లతో ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఇందులో స్మార్ట్ వాటర్ డ్రైనేజీ కోసం రూ.750 కోట్లు, సీవేజ్ ట్రీట్‌మెంట్, కాలువల నిర్మాణం, నీటి సరఫరా కోసం రూ.107.71 కోట్లు కేటాయించారు. కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి విజయం సాధించిన వెంటనే ఈ పనులన్నీ వేగంగా పూర్తి చేస్తామని దినకర్ చెప్పారు. రాబోయే రెండేళ్లలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, శ్మశాన వాటికలు, పార్కుల అభివృద్ధి కోసం ప్రత్యేక డీపీఆర్ సిద్ధం చేసి నగర రూపురేఖలు పూర్తిగా మారుస్తామని స్పష్టం చేశారు.

వరి కొయ్య.. కాల్చకయ్యా

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో బోర్లకింద వరిసాగు చేసిన రైతులు పంట పూర్తయిన తర్వాత వరి కొయ్యలు పొలంలోనే కాల్చవద్దని రేకులకుంట పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త నారాయణస్వామి తెలిపారు. పొలంలో కొయ్యలు కాల్చితే భూమి పై పొరలో ఉన్న పోషకాలు నాశనం అవడంతో పాటు, పంటకు మేలుచేసే కీటకాలు నశిస్తాయన్నారు. తద్వారా భూసారం తగ్గి పంటల దిగుబడిపై ప్రభావం చూపుతుందన్నారు. అవసరమైతే వరికొయ్యలను ట్రాక్టరు రోటావేటర్‌తో కలియ దున్నుకోవాలన్నారు. అనంతరం వారం రోజులు పొలానికి నీరు పెడితే కొయ్యలు కుళ్లిపోయి ఎరువుగా మారి, తర్వాత సాగుచేసే పంటకు మేలు జరుగుతుందని శాస్త్రవేత్త తెలిపారు.

చిట్కా

రైతేరాజు

వాతావరణంలో మార్పు.. పంటలకు ముప్పు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: జిల్లాలో మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా రైతులు సాగుచేసిన వేరుసెనగ, కంది, పత్తి, మొక్కజొన్న తదితర పంటల్లో చీడపీడల తెగుళ్లు వచ్చే అవకాశం ఉందని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త **గుత్తా నారాయణస్వామి** తెలిపారు. జిల్లాలో గత 15 రోజులుగా 5 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు తగ్గడంతో పంటల్లో వచ్చే వివిధ రకాల చీడపీడల తెగుళ్లను నివారించే పద్ధతులను ఆయన వివరించారు.

- **కంది:** కంది పంటలో ప్రస్తుతం వెర్రి తెగులు అధికంగా ఉంది. తెగులు సోకిన మొక్కలు పూర్తిగా తొలగించి నాశనం చేయాలి. పిండినల్లి తెగులు నివారణకు ప్రొపెనోఫాస్ 2 మి.లీ, ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- **వేరుసెనగ:** ఉష్ణోగ్రతలు తగ్గినప్పుడు ఈ పంటలో ప్రధానంగా పొగాకులద్దె పురుగుల ఉధృతి అధికంగా ఉంటుంది. ఆకులపై గుడ్లు, లార్వాను గుర్తించిన వెంటనే ఎకరానికి 5 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేస్తే పురుగులు వాటిలో పడి నశిస్తాయి.
- **పత్తి:** పత్తి పంటలో ప్రధానంగా రసం పీల్చు పురుగుల ఉధృతి అధికంగా ఉంది. ఈ పురుగుల నివారణకు రైతులు ఎకరా పొలంలో నీలం రంగు, పసుపు జిగురు అట్టలు 10 చొప్పున ఏర్పాటు చేసుకోవాలి. పురుగులు వాటికి అతుక్కుని నశిస్తాయి.
- **మొక్కజొన్న:** పంట 55 రోజుల దశలో ఉన్నప్పుడు ఆకుమాడు తెగులు పంటను ఇబ్బందులకు గురిచేస్తుంది. ఈ తెగులు నివారణకు మ్యాంకోజెబ్ 2.5 గ్రాములు, ప్రొపికొనజోల్ 25 శాతం ఈసీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే సరిపోతుంది.

రక్షక తడులతో ద్రాక్ష పంట సాగు

■ ఎకరాలకు 15 టన్నుల దిగుబడి

లెనిన్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: గ్రామీణ వ్యవసాయ పొలాల్లోని బోరుబావుల్లో నీటి మట్టం తగ్గినా అన్నదాతలు యాంత్రీకరణ పరికరాలను రక్షక తడులుగా మార్చుకొని ఉద్యాన పంటలు సాగు చేస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. మెలకువలు పాటించి పంటలను కాపాడుకోవడంతో రైతు కష్టార్జితానికి ప్రతిఫలం వస్తోంది. అనంత గ్రామీణం చియ్యేడులో రైతు అంజనరెడ్డి తనకున్న ఎకరా పొలంలో పదేళ్ల కిందట కూరగాయలు సాగుచేయడానికి పందిర్లు, ఇనుప తీగలు, రాళ్లు అమర్చారు. రెండేళ్ల కిందట కూరగాయల పంటలు తొలగించి అదే పందిర్ల కింద ద్రాక్ష సాగుచేశారు. కర్ణాటక రాష్ట్రం నుంచి (దిల్ కుష్) ద్రాక్ష రకం మొక్కలను సేకరించి నాటించారు. పంట సాగుకు ఎరువులు, వ్యవసాయ కూలీల ఖర్చులు, పెట్టుబడులకు రూ.1.50 లక్షలు వెచ్చించి కంటికి రెప్పలా ఆరు నెలలు కాపాడుకున్నారు. ద్రాక్ష పంట ఎకరాలో 15 టన్నుల దిగుబడి వచ్చింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో టన్ను రూ.45 వేలు ధర పలుకుతోంది. మరో 15 సంవత్సరాలు ఏటా ద్రాక్ష పంట చేతికి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు రైతు అంజనరెడ్డి. పీఏబీఆర్ కాలువల నుంచి స్థానిక చెరువులకు నీరు సరఫరా చేస్తే రైతులు రెట్టింపు పంటలు చేయడానికి వీలవుతుందని రైతులు కోరుతున్నారు.

చియ్యేడులో ద్రాక్ష పంటను చూపుతున్న రైతు అంజనరెడ్డి

వ్యాపారం పేరిట రూ.50 లక్షలకు టోకరా

ఈనాడు, అమరావతి: వ్యాపారంలో భాగస్వామ్యం ఇస్తామంటూ రూ.50 లక్షలు తీసుకొని మోసం చేసిన వైకాపా నాయకులపై చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా ఆదోనివాసి గుడిసె నరసింహులు కోరారు. న్యాయం కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆయన సోమవారం ఫిర్యాదు చేశారు. తన భూమిని ఆక్రమించిన మహిళ, ఆమెకు కొమ్ముకాస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని గార్లదిన్నెకు చెందిన ఎం.అనిల్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఏళ్లుగా తన సాగులో ఉన్న భూమిని ఆక్రమించడం అన్యాయమని బాధితుడు వాపోయారు.

అంతర్ విశ్వవిద్యాలయ టీటీ పోటీలకు ఎంపిక

ఆరుష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ విజయశ్రీ

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: విశాఖలోని గీతం విశ్వవిద్యాలయంలో జరగనున్న దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ టేబుల్ టెన్నిస్ పోటీలకు యువీఎస్ ఆరుష్ శ్రీవత్స ఎంపికయ్యారు. అనంతపురం వైద్య కళాశాలలో చదువుతున్న ఈ యువకుడు ఎన్టీఆర్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న అంతర్ కళాశాలల పోటీల్లో ప్రథమస్థానం సాధించి అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు అర్హత సాధించారు. ఈనెల 30 నుంచి వచ్చే నెల 2 వరకు జరగనున్న ఈ పోటీల్లో ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం తరఫున ఆతను ప్రాతినిధ్యం వహించనున్నాడు. అతడిని వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.విజయశ్రీ, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు పునర్నీవన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సునీల్, బి.అంజనేయబాబు నాయక్, పీడీ నరసింహానాయక్ పలువురు అభినందించారు.

అవినీతిపై పోరాటానికి ప్రజల సహకారం అవసరం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అవినీతికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ అవినీతి నిరోధక శాఖ ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ నంబరు 1064 పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లను ఎస్పీ జగదీశ్ సోమవారం ఛాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ ప్రసాద రెడ్డి, సీఐ హమీద్‌ఖాన్ పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేసినా, అవినీతికి పాల్పడినా ప్రజలు నిర్భయంగా ఏసీబీకి ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. అవినీతి నిర్మూలనకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. అవినీతికి సంబంధించిన సమాచారం తెలిసినప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలు అవినీతికి సంబంధించిన ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయవచ్చని, అలాగే వాట్సప్ నంబరు 94404 40057 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ జగదీశ్

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి, 3వ అంతస్తు, కెప్‌సి మేడమీద, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ నగర్ రోడ్డు, ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ :0866-2546922

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ షాహెన్షా హుస్సేన్ (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. 99891 79786
ఆస్తి తనిఖీ కొరకు : 94945 26440

Appendix – IV –A
[See Proviso to Rule 8(6) R/w Rule 9(1)]

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)కు రూల్ 9(1) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) వారికి **ఋణగ్రహీత: శ్రీమతి పూల కోమలత**, భర్త : లేటు పి. ఉమాపతి, డోర్ నెం.17-1-76 & 77, విద్యానికేతన్ స్కూల్ ప్రక్కన, వేణుగోపాల్ నగర్, అనంతపురం. **సహ-ఋణగ్రహీత: శ్రీ పూల విద్యా సాగర్,** తండ్రి : లేటు పి. ఉమాపతి, డోర్ నెం.17-1-76 & 77, విద్యానికేతన్ స్కూల్ ప్రక్కన, వేణుగోపాల్ నగర్, అనంతపురం. వారు **డిమాండ్ నోటీసు తేది.29-03-2025** ప్రకారం **తేది.29-03-2025** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము 1) **రూ.40,45,894/-** (అక్షరాల నలభై లక్షల నలభై ఐదు వేల ఎనిమిది వందల తొంభై నాలుగు రూపాయలు మాత్రమే), 2) **రూ.84,54,123/-** (అక్షరాల ఎనభై నాలుగు లక్షల యాభై నాలుగు వేల నూట ఇరవై మూడు రూపాయలు మాత్రమే), 3) **రూ.61,06,568/-** (అక్షరాల అరవై ఒక్క లక్షల ఆరు వేల ఐదు వందల అరవై ఎనిమిది రూపాయలు మాత్రమే) + **తేది.30.03.2025** నుండి తదుపరి వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి (తదుపరి జమలు ఉన్నచో తీసివేయబడును) వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి వారిచే భౌతిక స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖాలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఏలా ఉన్నదో అలానే" "ఏది ఏలా వుంటే అలానే" "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "రికోర్స్ లేకుండా" పద్ధతిపై **తేది.19-11-2026**న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీతకు ఇందుమూలముగా సూచించటమైనది.

షెడ్యూలు ఆస్తి వివరములు

ఐటమ్ నెం.1: రిజిస్టర్డు సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.4489/2009, తేది.17.06.2009 ప్రకారం గల ఆస్తి : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా వద్ద, అనంతపురం ఎస్ఆర్‌డీ & ఆర్‌డీ, వార్డు నెం. పాతది 12, కొత్తది 12, ప్రస్తుతం 17, టి.ఎస్.నెం.2097/2, ఎ.0.33 పైకి, ఎ.0.02, డోర్ నెం.పాతది 17/372-874ఎ, ప్రస్తుతం 17/1-77, అసెస్మెంట్ నెం.18768, 1001021484, వాటర్ ట్యాప్ అసెస్మెంట్ నెం.1001010155, హెచ్.ఎస్.సి. నెం.33236. **హద్దులు: తూర్పు :** ప్రభుత్వ భూమి మరియు మాచప్ప గారికి చెందిన మిషన్, **పడమర :** 30 అ॥ల రోడ్డు, **ఉత్తరం :** లక్ష్మమ్మ గారికి చెందిన డోర్ నెం.17/1-76తో గల ఇల్లు, **దక్షిణం :** రోడ్డు మరియు విద్యానికేతన్ స్కూల్. **కొలతలు : తూర్పు - పడమర దక్షిణం వైపు :** 54 అ॥లు లేదా 16.38 మీ॥లు, **తూర్పు - పడమర ఉత్తరం వైపు :** 56 అ॥లు లేదా 16.99 మీ॥లు, **ఉత్తరం - దక్షిణం తూర్పు వైపు :** 16.1/2 అ॥లు లేదా 5.01 మీ॥లు, **ఉత్తరం - దక్షిణం పడమర వైపు :** 16 అ॥లు లేదా 4.86 మీ॥లు., **మొత్తం విస్తీర్ణం : 99.33 చ॥గ॥లు.,**

ఐటమ్ నెం.2: రిజిస్టర్డు సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.16268/2010, తేది.04.12.2010 ప్రకారం గల ఆస్తి : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా వద్ద, అనంతపురం ఎస్ఆర్‌డీ & ఆర్‌డీ, వార్డు నెం.17, టి.ఎస్.నెం.2098 పైకి, ప్లాట్ నెం.16, ఎ.0.03.06, డోర్ నెం.పాతది 17-372-82, ప్రస్తుతం 17-1-76, అసెస్మెంట్ నెం.18709, 63028, 1001021474, హెచ్.ఎస్.సి. నెం.లు 22650, 49366, 94106, 114952, వాటర్ ట్యాప్ అసెస్మెంట్ నెం.21139-1001004612. **మేడమీద ఇంటితో గల ఖాళీ స్థలమునకు హద్దులు: తూర్పు :** టి.ఎస్.నెం.2099 లోని భూమి, **పడమర :** 33 అ॥ల రోడ్డు, **ఉత్తరం :** ఇదే సర్వే నెంబర్‌లోని బండి పుల్లయ్యప్ప గారికి చెందిన ఇల్లు, **దక్షిణం :** టి.ఎస్.నెం.2097 లోని పి. కోమలత గారికి చెందిన ఇల్లు. **కొలతలు : దక్షిణం వైపు :** 54 అ॥లు లేదా 16.45 మీ॥లు, **ఉత్తరం వైపు :** 62 అ॥లు లేదా 18.89 మీ॥లు, **తూర్పు వైపు :** 23.1/2 అ॥లు లేదా 7.47 మీ॥లు, **పడమర వైపు :** 23 అ॥లు లేదా 7.01 మీ॥లు., **మొత్తం విస్తీర్ణం : 149.8 చ॥గ॥లు.,**

Google Coordinates: Lat: 14.685465°; Long: 77.606076°

రిజర్వు ధర : రూ.1,51,00,000/- ధరావత్తు : రూ.15,10,000/- బిడ్ పెంపుదల : రూ.20,000/-

ఇ-వేలం తేదీ : 19-11-2026, సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు
వేలం పూర్తయ్యే వరకు ప్రతి బిడ్‌కు 5 ని॥ల అపరిమిత పొడిగింపు కలదు

పై ఆస్తి తనిఖీ తేది మరియు సమయం : తేది:28-10-2026 నుండి 18-11-2026 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఐయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు ఐదీలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు స్టేటుటరీ/నాన్ స్టేటుటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, అస్సెస్మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.
గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్‌లో" రూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలని సూచించటమైనది.
ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 194-1A యొక్క ప్రొవిజన్స్ ప్రకారం అమ్మకం జరుగును.

తేది: 26-10-2026, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

పాడి ఇంట.. ఇస్రో పంట

జాతీయ స్థాయి 28వ ర్యాంకుతో ఉద్యోగం

రెక్కల కష్టాన్ని నమ్ముకున్న పాడి రైతు కుటుంబం నుంచి వచ్చి.. దేశ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లో శాస్త్రవేత్త కొలువు సాధించిన ఆకుల సాయి సురేశ్ పదుగురికి స్ఫూర్తిగా నిలిచారు. శింగనమల మండలం చిన్నమట్లగొందికి చెందిన ఈ యువకుడు ఇస్రో ఉద్యోగ నియామక పరీక్షలో జాతీయ స్థాయిలో 28వ ర్యాంకుతో మెరిశారు. ఆయన విజయగాథను తన మాటల్లోనే తెలుసుకుందాం రండి.. **-న్యూస్‌టుడే, శింగనమల**

కుమారుడికి మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

తొలి వైఫల్యం నేర్పిన పాఠంతో..

మా నాన్న సూర్యనారాయణ యాదవ్ రైతు. అమ్మ రామాంజినమ్మ పశువుల పెంపకం, పాలు అమ్ముతూ చమటోడ్చి నన్ను చదివించారు. ఆ కష్టాన్ని చూస్తూ పెరిగిన నేను దేశం గర్వించే స్థాయికి చేరి వారి కళ్లలో ఆనందం చూడాలనుకున్నా. బీటెక్ మెకానికల్ పూర్తయిన తర్వాత, 2023లో గేట్‌లో మంచి ర్యాంకు తెచ్చుకొని వరంగల్ నిట్‌లో ఎంటెక్ (పీజీ) చేరా. హైదరాబాదులోని ఆర్‌సీఐ-డీఆర్‌డీఓలో రీసెర్చ్ ఇంటర్న్ చేసినప్పుడు పరిశోధనలపై మక్కువ కలిగింది. అప్పుడే ఇస్రోలో అడుగుపెట్టాలని నిర్ణయించుకున్నా. అదే ఏడాది రాసిన ఇస్రో పరీక్షలో 1.67 మార్కుల తేడాతో అవకాశం కోల్పోయా. ఆ వైఫల్యాన్ని పాఠంగా మార్చుకున్నా. ఎంటెక్ చేస్తూనే వేకువజామున 4 గంటలకే లేచి దాదాపు మూడు గంటలు ఇస్రో సన్నద్ధతకు సమయం కేటాయించేవాడిని. 2025 మేలో ఇస్రో (ఐసీఆర్‌బీ) నోటిఫికేషన్ వెలువడింది. మూడు నెలలు మళ్లీ తీవ్రంగా సాధన చేశా. ఆక్టోబరులో పరీక్ష రాశా. ఇంటర్వ్యూలో కమ్యూనికేషన్ ఇబ్బందులను అధిగమించా. 2026 మేలో ఎంటెక్ పూర్తయింది. జూన్‌లో అంతర్జాతీయ ఏరోస్పేస్ సంస్థ (ప్రైవేట్)లో ఉద్యోగం వచ్చింది. అక్కడ విధులు నిర్వహిస్తున్నప్పుడే ఫలితాలు వచ్చాయి. ఆల్ ఇండియా 28వ ర్యాంకు సాధించా. దేశ అంతరిక్ష రంగానికి సేవలందిస్తూ.. భవిష్యత్తులో ఇస్రో ఛైర్మన్ కావడమే నా అంతిమ లక్ష్యం.

విద్యా ప్రస్థానం..

ప్రాథమిక విద్య: శింగనమలలోని ప్రైవేటు పాఠశాలలో 1 నుంచి 4వ తరగతి
పాఠశాల, ఇంటర్: కొడిగెనహళ్లి ఏపీ రెసిడెన్షియల్. ఇంటర్‌లో 975 మార్కులు
బీటెక్: ఎస్వీయూలో మెకానికల్ ఇంజినీరింగ్
ఎంటెక్: నిట్ (వరంగల్)లో మెషిన్ డిజైన్ స్పెషలైజేషన్

కదిరి ఆలయ సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నేడు (మంగళవారం) ఉదయం 6గంటల నుంచి 6.45 గంటల వరకు స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తారు. ఖాద్రీశునికి ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు అభిషేక పూజలు. 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వదర్శనం ఉంటుంది.

EENADU Classifieds

EDUCATION

DMLT 2 సం॥ కోర్సునకు అడ్మిషన్లు. Q: Any ఇంటర్ పాస్. అర్హులైన వారికి స్కాలర్‌షిప్. Seeds కాలేజ్ ATP. 9100494926, 9440255034.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఒ లైన్ ప్రకటన రూ.395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ప్లాట్లు, పొలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు: 8008709784

నాడు అర్ధాంతరం.. నేడు సంపూర్ణం

నాడు ఆగిన పాఠశాల అదనపు తరగతి గదులు

పూర్తయిన అనంతరం ఇలా..

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పాలవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులు వైకాపా హయాంలో నాడు-నేడు కింద మంజూరైనా పూర్తి కాలేక అర్ధాంతరంగా ఆగి ముళ్ల పొదలతో నిలిచింది. 10 తరగతి గదుల నిర్మాణం కోసం పనులు ప్రారంభించగా నిధుల లేమి కారణంగా మధ్యలోనే ఆగింది. 6-10వ తరగతి వరకు 145 మంది విద్యార్థులు ఇరుకుగదుల్లోనే సమస్యల నడుమ ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. గత ఏడాది జులైలో గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు పాఠశాలలో నెలకొన్న సమస్యను ఉపాధ్యాయులు, గ్రామస్థులు విన్నవించారు. వెంటనే ఆయన స్పందించి కలెక్టర్‌తో చర్చించి ఎస్సార్సీ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.60 లక్షలతో భవన నిర్మాణాన్ని పూర్తి చేయించారు. ఈ పాఠశాల అభివృద్ధిని జిల్లా కలెక్టర్, జిల్లాస్థాయి విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. అతి త్వరలోనే భవనం ప్రారంభం కానుందని విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తెలిపారు.

పెళ్లింట విషాదం

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్రగాయాలు

సావిత్రమ్మ

కణేకల్లు, న్యూస్‌టుడే : పెళ్లి బాజాలు మోగాల్సిన ఇంట మరణమృదంగం మోగింది. మరో ఇరవై రోజుల్లో కుమారుడి పెళ్లి కావడంతో సందడి నెలకొన్న ఆ ఇంట్లో విషాదం అలుముకుంది. పెళ్లికార్డు ఇచ్చి బంధువులను ఆహ్వానించేందుకు కారులో వెళ్లిన తల్లి సావిత్రమ్మ(53) కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువు కబళించింది. తండ్రిని తీవ్ర గాయాల పాలైసిన హృదయ విషాదకర సంఘటన సోమవారం జరిగింది. కర్ణాటక పోలీసులు, స్థానిక బంధువులు తెలిపిన వివరాలిలా.. కణేకల్లుకు చెందిన బూదగవి వీరేష్, సావిత్రమ్మ దంపతులు కుమారుడు పవన్‌కుమార్ పెళ్లికి కర్ణాటకలోని కంప్లి సమీపంలో గల బంధువులను ఆహ్వానించేందుకు ఉదయాన్నే అద్దె కారులో బయలుదేరారు. బళ్లారి నుంచి కంప్లి వైపు వెళ్తుండగా హొసదరోజి-దేవలాపురం నడుమ కణివె మారెమ్మ ఆలయం సమీపంలో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో సావిత్రమ్మ ఘటనా స్థలంలో మృతి చెందారు. భర్త వీరేష్‌తో పాటు డ్రైవరు శీనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను బళ్లారి విమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కుడితిని ఎస్సై ముత్తురంగస్వామి తెలిపారు. ఆమె మరణ వార్త విన్న పెళ్లింట, బంధువర్గాల్లో విషాదం అలుముకుంది.

ఇళ్లలోకి దూరి దాడులు.. కేసుల నమోదు

తాడిపత్రి, న్యూస్‌టుడే: మండలంలోని గన్నెవారిపల్లి కాలనీ, వంగనూరులో ముగ్గురు వైకాపా నాయకుల ఇళ్లలోకి దూరి దాడులకు పాల్పడిన ఘటనలో నిందితులపై కేసులు నమోదు చేసినట్లు గ్రామీణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం ఇక్కడ మాట్లాడుతూ ఆదివారం అర్ధరాత్రి కొందరు వ్యక్తులు గన్నెవారిపల్లి కాలనీలో ఉన్న ప్రదీప్‌రెడ్డి ఇంటికి వెళ్లి సామగ్రిని పగలగొట్టి, అతడిపై దాడిచేసి గాయపరిచారని చెప్పారు. అక్కడి నుంచి రామశేఖర్ ఇంటికి వెళ్లి ఆవరణలో ఉన్న కారు, ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేశారన్నారు. వంగనూరు గ్రామ నాయకుడు సూర్యనారాయణరెడ్డి ఇంటిలోకి దూరి సామగ్రితో పాటు రెండు ద్విచక్ర వాహనాలను నాశనం చేశారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

దొంగ నుంచి ఆభరణాల మూట స్వాధీనం

శాంతినగర్, న్యూస్‌టుడే: జోగులాంబ గద్వాల జిల్లాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద 10 తులాల బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి కళ్యాణదుర్గం వాసిగా గుర్తించారు. గద్వాల డీఎస్పీ మొగులయ్య కథనం ప్రకారం.. 'గద్వాల జిల్లా శాంతినగర్‌లో ఈ నెల 14న తోట మాధవరావు అనే వ్యక్తి ఇంట్లో దొంగతనం జరిగింది. ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాలతో ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టాం. ఇందులో భాగంగా సోమవారం అలంపూర్ చౌరస్తాలో తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న కళ్యాణదుర్గం పట్టణం కమ్మంచేట్ల వీధికి చెందిన వడ్డెపేట్ల గంగాధర్ (31)ను పట్టుకున్నాం. అతడిపై 43 దొంగతనం కేసులు ఉన్నాయి. కొన్ని కేసుల్లో 2014, 2018 సంవత్సరాల్లో శిక్షలు పడ్డాయి. అతడు దొంగతనం చేసిన ఆభరణాల్లో సగం శైలజ అనే మహిళ ద్వారా ఇతరుల పేరుపై కళ్యాణదుర్గంలోని బ్యాంకులో తనఖా పెట్టి రుణం తీసుకున్నాడు. వాటిని రికవరీ చేయాల్సి ఉంది. శాంతినగర్‌లో మాధవరావు ఇంటితోపాటు, అదే రోజు మరో దొంగతనం అతడే చేసినట్లు గుర్తించాం. దొంగను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు, పాత నేరస్థులకు సంబంధించిన వివరాలు సహాయపడ్డాయి' అని డీఎస్పీ వివరించారు.